


# విలన్

**ఏ ముహూర్తాన** ఆంధ్రభూమి ఎడిటర్ సి.కనకాంబరరాజు నన్ను ఏ వారానికి ఆ వారం సీరియల్ రాయడానికి అనుమతించారో కాని, అప్పటినించీ నేను దాదాపు అన్ని మంత్లీ, వీక్లీ, డైలీ సీరియల్స్ అప్పటికప్పుడు రాసిస్తూ వచ్చాను. దాంతో అంతకు మునుపటిలా ఏకబిగిన నవల రాయాల్సిన అవసరం లేకపోయింది. ఎడిటర్స్ మారి క్రమంగా పత్రికలు నా సీరియల్స్ వేయడం తగ్గించాక ఏకబిగిన రాయడం మీద ఆసక్తి లేక నవలలు రాయడం తగ్గింది. ఇంతదాకా డైరెక్ట్ నవలలు ఐదే రాసాను. వాటిలోని రెండు మందాకిని, వెడ్డింగ్‌బెల్స్. ఎమెస్కో శేషాచల కుమార్‌గారు వెంటనే నవలగా ప్రచురించడానికి ఎక్కడా సీరియల్‌గా వెలువడని నవలే కావాలని అడిగి రాయించారు. మిగిలిన మూడిటలో ఒకటి విలన్.




లిపి పబ్లికేషన్స్ ఆరంభించినప్పటి నించి రెండు, మూడు నెలలకి గేప్ రాకుండా ఓ కొత్త నవలని వెలువరిస్తూ వస్తున్నాను. మే 1998లో నవలని వెలువరించడానికి పూర్తైన సీరియల్ లేక డైరెక్ట్ నవలని రాయాల్సి వచ్చింది. అలా వెలువడ్డ నవల విలన్.

నేను రాసిన చాలా నవలలకి థీమ్స్ నేను చదివిన వాటిలోంచి, విన్న వాటిలోంచి స్ఫురించాయి. కానీ వాసనని బట్టి స్ఫురించిన నవల విలన్. మా అమ్మ తరఫున అద్దెలు వసూలు చేసుకుని జనవరి 1998లో నేను విజయవాడ నించి హైదరాబాద్‌కి తిరిగి బస్‌లో వస్తున్నప్పుడు దారిలో ఓ చోట మాంసం కాలుతున్న వాసన వేసింది. కిటికీలోంచి చూస్తే చాలా దూరంలో చెట్లమధ్య పొగ కనిపించింది. ఎవర్నైనా చంపి శవాన్ని కాల్చేస్తున్నారా? అనే ఆలోచన కలిగింది. పాతి పెట్టచ్చుగా! కాల్చడం దేనికి? అంత కసి ఉండచ్చా? లేక పాతిపెడితే ఎప్పటికైనా బయట పడచ్చునా? కాలిస్తే శవం ఎవరిదో గుర్తుపట్టలేరనా? అది మనిషి శవమా? లేక విందు చేసుకునే వారు కాల్చే ఏ గొర్రెలాంటి జంతువా? ఒక వేళ మనిషైతే ఎందుకు చంపి ఉంటారు? బస్ హైదరాబాద్ చేరేదాకా ఆ విషయాలే ఆలోచిస్తూండిపోయాను. మనసులో ఆ ఆలోచనల్లోంచి ఓ క్రైం నవలకి ఇతివృత్తం తయారైంది. ఈ నవలని హీరో కోణం నించి

కాక, హంతకుడి కోణం నుంచి నడపాలని అనుకున్నాను. అందుకని నవల్లో విలనే ప్రధాన పాత్ర అయ్యాడు. ఈ నవలకి పేరుగా హంతకుడు, నేరస్థుడు, క్రిమినల్, మర్డర్‌లాంటి కొన్ని పేర్లు తట్టినా, వీటన్నిటికన్నా బాగా నలిగిన పదం ‘విలన్’ నచ్చి ఆ నవలకి ఆ పేరు పెట్టాను. దీంట్లో హీరో ఉండడు.

అప్పట్లో ఎన్టీఆర్ ఎస్టేట్‌లో ఐశ్వర్య సిల్క్స్ అనే కంచిపట్టు చీరల దుకాణం నడిపే కోదండరాం అనే అతనితో నాకు పరిచయం ఉండేది. ఆయన నా అభిమాని. రెండు, మూడుసార్లు ఆయన ఆహ్వానం మీద ఆ దుకాణానికి వెళ్ళినప్పుడు కంచికి వెళ్ళి చీరలు కొనుక్కురావడం మొదలైన వ్యాపార విషయాలు నాకు చెప్పారు. (వీరి గురించి ‘ది గెస్ట్’ నవలా పరిచయంలో కూడా రాసాను) ఆ సమాచారంతో విలన్ అలాంటి షాప్‌ని నడుపుతున్నట్లు రాస్తూ కంచిపట్టు చీరల గురించి చాలా సమాచారం రాసాను. అది మహిళా పాఠకులకి ఆసక్తిగ ఉంటుందని భావించాను.




క్లైమేక్స్‌లో విలన్ శిక్షింపబడాలి. కానీ డిటెక్టివ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ లేదా హీరో పాత్ర లేదు. మరెలా? క్లైమేక్స్‌లోని ఈ భాగం తట్టకపోవడంతో దాని కోసం ఆగాను. ఫిబ్రవరి 1998లో మా పిల్లలతో నేను హైదరాబాద్‌లో కొత్తగా ఆరంభమైన లుంబినీ పార్క్‌కి వెళ్ళాను. మా పిల్లలు ఆడుకుంటూంటే నా మనసు ఆ క్లైమాక్స్ మీదే ఉంది. అకస్మాత్తుగా అక్కడ నాకు అది స్ఫురించింది. నవల్లోని బాధితురాలే అతని విలనీని తెలుసుకుని శిక్షిస్తే అని కలిగిన ఆలోచనలోంచి ఎలా అన్నది రూపొందించుకున్నాను.

ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆఫీస్ బంజారాహిల్స్ హిందూ స్మశాన వాటికకి ఎదురుగా ఉండేది. ఎయిర్ హోస్టెస్ డైలీ సీరియల్ ఇవ్వడానికి వెళ్ళినప్పుడు నా కారుని దాని ముందే ఆపేవాడిని. అందులో హత్య జరిగి, వెంటనే శవాన్ని కాల్చేస్తే ఇక హంతకుడు పట్టుబడడు అనే ఆలోచన ఓసారి నాకు అక్కడ కలిగింది. అది గుర్తురావడంతో క్లైమాక్స్ కూడా చక్కగా కుదిరింది. ఏ ఇంగ్లీష్ వార్త లేదా అమెరికన్ వారపత్రికల్లోని ఏ అంశం మీదా ఆధారపడకుండా నా ఊహల్లోంచి అల్లిన నవల విలన్.

మార్చ్ 1998లో పన్నెండు రోజుల్లో దీన్ని రాసేసి ప్రెస్‌కి పంపాను. మే 1998లో డైరెక్ట్ నవలగా ఇది లిపి పబ్లికేషన్స్ నించి వెలువడింది. వెల రూ.50/- ఇది మాత్రం కన్నడంలోకి అనువాదం కాలేదు.

ఏ విలన్‌కైనా ప్రధానంగా ఉండేది స్వార్థం. ఉండనిది మానవత్వం. ఈ లక్షణాలు గల వాచస్పతి స్వార్థంతో మూడు హత్యలు చేస్తాడు. తన వ్యాపార భాగస్వామిని, తన మామగారిని, మరొకర్ని. భాగస్వామి భార్యకి చివర్లో తన భర్తని చంపింది వాచస్పతి అని తెలిసి అతన్ని శిక్షించడంతో నవల ముగిస్తుంది. నవల ఎన్నో మలుపులతో, అనూహ్య సంఘటనలతో సాగుతుంది. అందువల్లే అనుకుంటా ఇది త్వరగా అమ్ముడైన నవల. మలి ముద్రణ కూడా వేగంగా అమ్ముడైపోయింది. ప్రస్తుతం ఇది మార్కెట్లో లేదు.

చక్కటి క్రైం సినిమా తీయడానికి ఉపయోగపడే ఈ సబ్జెక్ట్‌కి ప్రధాన అడ్డంకి సూపర్ హీరోల యుగం. మేథస్సుతో కాక పశుబలంతో సాధించే హీరోలకి ప్రేక్షకులు అలవాటు పడ్డారు కాబట్టి, సినిమాకి పనికి వచ్చే ఈ నవల నేటి తెలుగు తెరకి పనికిరాదు.

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*